అంతటా శరన్నవరాత్రుల శోభ



ప్రత్యేక పుష్పాలంకరణలో మావుళ్లమ్మ



జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ పల్లకి సేవలో కలశాలతో మహిళలు

ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి మహోత్సవాలు తొలిరోజు గురువారం ఉదయం 4.30 గంటలకు కలశ స్థాపన చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మావుళ్లమ్మ ఉత్సవ మూర్తికి సువర్ణ రజత కవచాలంకరణ, పలు గరగలతో నేత్ర పర్వంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కళా వేదికపై చండీహోమం, లక్ష కుంకుమార్చనలు వేద పండితులు భక్తులతో చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ఆశీస్సులు పొందారు. సాయంత్రం కళా వేదికపై ఆధ్యాత్మిక ప్రవచనం, జానపద నృత్య ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నవరాత్రుల కలశ స్థాపన పూజలు జరిగాయి.



బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో ఏలూరు సత్రంపాడులోని అంబికాదేవి

పేదలకు పరీక్ష



జిల్లాలో మొత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	62
చేయాల్సిన పరీక్షల సంఖ్య	60
ల్యాబ్ టెక్నీషియన్లు లేని ఆసుపత్రులు	10
సహాయక సిబ్బంది చేయడానికి అవకాశం ఉన్న పరీక్షలు	14

✷ ఇవి జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో నిరుపయోగంగా ఉన్న ల్యాబు పరికరాలు. ఏడేళ్లుగా ఇక్కడ ల్యాబు టెక్నీషియన్ లేక పరీక్షలు జరగడం లేదు. ఏడాది క్రితం వరకు మరో ఆసుపత్రి టెక్నీషియన్ మూడు రోజులు వచ్చేవారు. ప్రస్తుతం ఎవరూ రావటం లేదు. దీంతో ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు.

✦ నిడమర్రు మండలం పెదనిండ్రకొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ల్యాబ్ టెక్నీషియన్ లేరు. దీంతో ఉంగుటూరు మండలం చేబ్రోలు పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ వారానికి మూడు రోజులు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రెండు చోట్లా రోగులు పరీక్షలకు అవస్థలు పడుతున్నారు. టెక్నీషియన్ ఉన్నప్పుడే పరీక్షలు చేయించుకోవాలి.

✦ ల్యాబు టెక్నీషియన్ లేక బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం పీహెచ్‌సీకి రోజూ వచ్చే 60 మంది ఇబ్బందికి తప్పడం లేదు. నందాపురం పీహెచ్‌సీ ఎల్‌టీ డిప్యుటేషన్‌పై వారంలో మూడు రోజుల పాటు ఇక్కడ పని చేస్తున్నారు.



జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పీహెచ్‌సీలో ఎల్‌టీ లేకపోవడంతో రోగికి మధుమేహ పరీక్షలు చేస్తున్న స్టాఫ్ నర్సు



ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే- బుట్టాయగూడెం, ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి

జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ కొనసాగుతున్నా పీహెచ్‌సీల్లో పరీక్షలు మాత్రం సవ్యంగా జరగడం లేదు. సిబ్బంది లేమితో చాలా ఆసుపత్రుల్లో అసలు పరీక్షలే చేయడం లేదు. కొన్నిచోట్ల రసాయనాల, పరీక్ష కిట్ల కొరత వేధిస్తోంది.

రెంటికీ చెడ్డ రేవడిలా

జిల్లాలో 10 చోట్ల ల్యాబు టెక్నీషియన్ల కొరత ఉంది. కొందరిని సమీప ఆసుపత్రులకు డిప్యుటేషన్‌పై పంపారు. వీరు మూడు రోజుల చొప్పున రెండు చోట్లా పనిచేయాలి. దీంతో వీరు ఎప్పుడుంటారో తెలియని పరిస్థితి. మన్యం మండలాల్లో ఫలితాలు కచ్చితంగా రావటం లేదు. ఈ పరిస్థితిపై డీఎంహెచ్‌వో షర్మిష్ఠ మాట్లాడుతూ సిబ్బంది నియామకాలపై కసరత్తు చేస్తున్నామని, టైఫాయిడ్ కిట్ల కొరత లేకుండా చూస్తామని తెలిపారు.

నెలకోసారి ఎగనామం

జిల్లాలో ల్యాబు టెక్నీషియన్లకు నెలవారీ సమావేశంతో నెలకోసారి పరీక్షలకు ఎగనామం పెడుతున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో పరీక్షలే జరగలేదు.

పరిశీలన

పరీక్ష కిట్ల కొరత

జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీల్లో టైఫాయిడ్ కిట్ల కొరతతో చాలా చోట్ల ఈ పరీక్షలు చేయడం లేదు. దీంతో ఒక్కొక్కరిపై ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలకే రూ.2500 వరకు భారం పడుతోంది. కుటుంబం మొత్తానికి జ్వరాలు వస్తే పరీక్షలకే రూ.10వేలు ఖర్చవుతోంది. ఫలితంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై పెనుభారం పడుతోంది.

☛ పీహెచ్‌సీల్లో వేధిస్తున్న ల్యాబు టెక్నీషియన్ల కొరత

☛ సవ్యంగా సాగని వైద్య పరీక్షలు

☛ పేద, మధ్య తరగతిపై ఆర్థిక భారం

రూ.1200 ఖర్చయింది

మూడు రోజులైనా జ్వరం తగ్గకపోవడంతో రక్త పరీక్షల కోసం పెదనిండ్రకొలను పీహెచ్‌సీకి వెళ్లాను. ల్యాబ్ టెక్నీషియన్ గురువారం వస్తారు అప్పుడు రమ్మన్నారు. దీంతో తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ల్యాబ్‌కి వెళ్లి పరీక్షలు చేయించుకున్నా. టైఫాయిడ్ అని తేలింది. రూ.1200 ఖర్చు అయింది.

-శ్రీనివాసరావు, బువ్వనపల్లి నిడమర్రు మండలం

కచ్చితత్వం లేదు

మా అబ్బాయి అజయ్‌బాబుకు అంతర్వేదిగూడెంలో రక్తపరీక్ష చేసి మలేరియా ఉందన్నారు. మందులు వాడినా జ్వరం తగ్గలేదు. జంగారెడ్డిగూడెంలో ప్రైవేటుగా రక్తపరీక్షలు చేయించా. పరీక్షలు, చికిత్సలకు రూ.15 వేలకు పైగా ఖర్చయ్యింది. పీహెచ్‌సీ పరీక్షల్లో కచ్చితత్వం లేదు.

-గురుగుంట్ల లచ్చిరెడ్డి, మోతుగూడెం, బుట్టాయగూడెం





పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది



హాల్ టికెట్ల సంఖ్య ఆధారంగా కేటాయించిన కంప్యూటర్ ల్యాబ్ వివరాలను పరిశీలించుకుంటూ..

టెట్ పరీక్షలు ప్రారంభం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) గురువారం ప్రారంభమయ్యాయి. ఏలూరు సమీపంలోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి తొలిరోజు 38 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 186 మంది హాజరుకావాల్సి ఉండగా 163 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 186 మందికి 171 మంది హాజరయ్యారు. 15 మంది హాజరు కాలేదు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ నెల 21 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. చరవాణులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రం లోనికి అనుమతించలేదు. వాటిని సిబ్బంది సేకరించి భద్రపరిచారు. ఏవిధమైన చూచిరాత కేసు నమోదు కాలేదని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

మద్యం దుకాణాలకు 32 దరఖాస్తులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల ఏర్పాటుకు ఏలూరు జిల్లాలో గురువారం నాటికి 32 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటిలో ఆఫ్‌లైన్‌లో 30 దరఖాస్తులుండగా ఆన్‌లైన్‌లో రెండు నమోదు చేశారు. అత్యధికంగా చింతలపూడి ఎక్సైజ్ కార్యాలయం కేంద్రంలో గురువారం 16 దరఖాస్తులు వచ్చాయి. నూజివీడులో 6 ఆఫ్‌లైన్‌లో, 2 ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ఇక ఏలూరు సెంటర్‌కు ఒకే ఒక్క దరఖాస్తు రావటం విశేషం. కైకలూరులో తొలిరోజు బుధవారం 2 నమోదుకాగా గురువారం 5 దరఖాస్తులొచ్చాయి. మొత్తంగా ఈ రెండురోజుల్లో 32 దరఖాస్తులు నమోదైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

నేనొక మోక్షం లేని వారధిని!

అనుసంధాన రోడ్డు వేయడానికి 15 ఏళ్లా?

కలిదిండి, న్యూస్‌టుడే

అనగనగా నా పేరు వారధి. ఏలూరు జిల్లా కలిదిండి మండలం కోరుకొల్లు-ఆవకూరు నా చిరునామా. పెదలంక డ్రెయిన్‌పై ఉన్న పాత వంతెన 25 ఏళ్ల కిందట శిథిలావస్థకు చేరింది. ఆ విషయాన్ని గుర్తించిన పాలకులు, అధికారులకు కొత్త వంతెన నిర్మించాలన్న ఆలోచన రావడానికి పదేళ్లు పట్టింది. ఎట్టకేలకు నన్ను నిర్మించడానికి 15 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. నన్ను నిర్మించేసరికి నిధులు అయిపోయాయట. అనుసంధాన రోడ్డుకు డబ్బులు సరిపోలేదని చేతులు దులిపేసుకున్నారు. ఆ తర్వాత ముచ్చటగా మూడు ప్రభుత్వాలు మారాయి. ముగ్గురు ఎమ్మెల్యేలు.. ముగ్గురు ఎంపీలు.. మధ్యలో మంత్రులు కూడా వచ్చి వెళ్లిపోయారు. అయినా..నన్ను ఎవరూ పట్టించుకోలేదు. నా బాధంతా ప్రయాణికుల కోసమే. కూలడానికి సిద్ధంగా ఉన్న నా మీద నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వాహనాలు, బడి బస్సులు, ఆటోలు.. ద్విచక్ర వాహనాలైతే గంటకు వెయ్యికిపై తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందో.. ఏ క్షణం కూలబడిపోతుందోనన్న భయం నన్ను వెంటాడుతోంది. ఆ హృదయ విదారక దృశ్యాలు ఎక్కడ చూడాల్సి వస్తుందోనని ఆవేదన చెందుతున్నా. నాకు అనుసంధాన రోడ్డు వేసేస్తే.. అందరికీ సురక్షిత ప్రయాణాన్ని అందించాలి ఆశగా ఎదురు చూస్తున్నా. రూ.3 కోట్లు అంచనాతో ప్రతిపాదనలు పంపించామని ఆర్‌అండ్‌బీ డీఈ అనిల్ చెబుతున్నారు. ఇప్పటికైనా నాకు మోక్షం ఇవ్వండి.





- ఇట్లు
పెదలంక వారధి, కోరుకొల్లు ఆవకూరు ఏరియా, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతూ బోనఫైడ్ నివాసులైన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 30 వరకు గడువుందని, ప్రవేశ పరీక్ష 2025 ఆగస్టు 8న నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి సమావేశం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047పై జిల్లా స్థాయి సమావేశాన్ని ఈ నెల 4న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరిగే సమావేశంలో కలెక్టర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

ఈ లెక్క సరిచేయాల్సిందే!

✪ ఉమ్మడి జిల్లాలో 19 శాతం విద్యార్థులు డుమ్మా
✪ దసరా సెలవుల అనంతరం చర్యలకు ఆదేశం

పాలకొల్లు, న్యూస్‌టుడే

రాష్ట్రంలో సరాసరిన 24 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆశ్చర్యానికి గురయ్యారు. బడికి వచ్చేవారే రావడం లేదా లేక కేవలం రికార్డుల్లో చూపించడంతో ఇంత వ్యత్యాసం కనిపిస్తుందా.. అనే అనుమానం వ్యక్తం చేస్తూ హాజరుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తరుణంలో మన ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే 24 కాదుగాని సరాసరిన 19 శాతం మంది విద్యార్థులు గైర్హాజరవుతున్నారని తేలింది.



ఆరా దీసేవారు కరవు..

గతంలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడం వారిని పాఠశాలలకు రప్పించడం ఆనవాయితీగా ఏటా జరిగేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక అటువంటి కార్యక్రమం ఒకటుందని విద్యాశాఖ మరిచిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి దృష్టి సారించలేదు. అసలు పాఠశాల హాజరు పట్టీలో ఉన్న వారంతా నిత్యం పాఠశాలకు వస్తున్నారా లేదా అనే ఆరాదీసేవారు కరవయ్యారు. రిజిస్టర్‌లో ఉన్నవారికి హాజరవుతున్నవారికి పొంతన లేకుండా పోయింది.

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం విద్యార్థులు
ఏలూరు	1,390	193	219	1,22,790
పశ్చిమ	1,069	87	212	92,920

వివరణ ఇవ్వలేకనే

వాస్తవానికి గైర్హాజరుకు కారణాలు అడుగుతారు. మధ్యాహ్న భోజనం చేసేవారిని తక్కువ మందిని చూపిస్తే వివరణతో లేఖ రాయమంటారు. ఇవన్నీ ఎదుర్కొనే ఓపిక లేకనే చాలా పాఠశాలల్లో హాజరు నుంచి మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్య వరకు సరైన వివరాలు నమోదు చేయలేకపోతున్నారని ఒక ఉపాధ్యాయుడు వాపోయారు.

పథకాలు పోతాయని

బడికి సరిగా రాకపోయినా ప్రభుత్వ పథకాలు పోతాయనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు డ్రాపవుట్లు చూపనిచ్చేవారు కాదు. వలసలు వెళ్లినా విద్యార్థులు బడికి రాకపోయినా కొందరి పేర్లు రిజిస్టర్‌లో కొనసాగించడం కొన్నిచోట్ల అలవాటుగా మారింది. ఇవన్నీ కలిసొచ్చి ఉన్న విద్యార్థులకు హాజరవుతున్న విద్యార్థులకు సంబంధం లేకుండా పోతోంది.

ఏలూరు జిల్లాలో అధికం..

దసరా సెలవులు రావడంతో ఈ నెల 1 పాఠశాలలకు చివరి పని దినం. ఆ రోజున హాజరైన విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే ఏలూరు జిల్లాలో మొత్తం 1,22,790 మంది విద్యార్థులుండగా 1,76,171 మంది 79 శాతంతో హాజరయ్యారు. పశ్చిమలో ఇదే రోజు హాజరు చూస్తే 92,920 మందికి 78,185 మంది హాజరవడంతో 84శాతం నమోదైంది. ఎక్కడ ఏ సమస్య వస్తుందోనని వాస్తవాలను గుట్టుగా ఉంచుతున్న పరిస్థితి. దీనిపై ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహంను సంప్రదించగా సెలవుల ముందు రోజు కావడంతో 1వ తేదీన హాజరు తగ్గుండొచ్చన్నారు. సెలవుల అనంతరం అలా ఉండకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధే లక్ష్యం: మంత్రి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు రామనారాయణ రెడ్డి, పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం దగ్గర నుంచి దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వరకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి కొలుసు పార్థసారథి, కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రులు, కలెక్టర్‌కు వేద పండితులు, దేవాదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేశ్‌బాబు, జిల్లా అధికారి రంగారావు, ఆలయ ఈవో డి.సురేశ్‌బాబు ఘన స్వాగతం పలికారు. దాత మడుపల్లి రామనాగ లక్ష్మీనారాయణరావు, వారి కుమారుడు మడుపల్లి గోపాల్ కుటుంబసభ్యులు రూ.40 లక్షలతో నిర్మించిన స్వామివారి కల్యాణ మండపాన్ని మంత్రులు ప్రారంభించారు. సభలో మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునఃనిర్మాణాలకు నిధులు కేటాయిస్తామన్నారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలను ఆధ్యాత్మికంగా, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో వై.భవానీశంకరి, తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం లక్ష్యం



మాట్లాడుతున్న పద్మశ్రీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందని జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. ఏలూరు జిల్లా పంచాయతీ రాజ్ వనరుల శిక్షణ కేంద్రంలో గురువారం ఆమె శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 ప్రకారం పంచాయతీల్లో పది అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సాధారణ పరిపాలన విధానం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అవగాహన, ప్రభుత్వ పథకాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, జడ్పీ శిక్షణ విభాగం సమన్వయకర్త ప్రసంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్పులు.. చేర్పులు

ఓటరు నమోదు అర్జీల స్వీకరణకు 18 వరకు అవకాశం



చింతలపూడి, న్యూస్‌టుడే: ఏ ఎన్నికలైనా అర్హులు ఓటుహక్కు వినియోగించుకోవాలనే ధ్యేయంతో కేంద్ర ఎన్నికల సంఘం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఓటరు నమోదుకు, జాబితా సవరణకు ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి అర్హులైన కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేయిస్తారు. మృతులు, శాశ్వత వలస ఓటర్ల తొలగింపు, సవరణ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆగస్టు 20 నుంచి ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఈ నెల 18 వరకు అర్జీలు స్వీకరించనున్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో 90శాతం పైగా సర్వే పూర్తి చేశారు. అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు, మరణించినా పేరున్న వారు.. శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు వారికి ఇస్తే.. వాటిని పరిశీలించి అర్హుల పేర్లు జాబితాలో చేరుస్తారు. ఈ ప్రక్రియ తర్వాత జనవరి 6న తుది జాబితా విడుదల చేస్తారు.

18-19 మధ్య 42వేల మంది ఓటర్లు

ఏలూరు జిల్లాలో మొత్తం 16,38,116 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 7,99,901, మహిళలు 8,38,089, థర్డ్ జెండర్ 126 మంది ఓటర్లున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు 18-19 మధ్య వయస్సు ఉన్న 42వేల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకునే అవకాశం ఉండటంతో పాటు జాబితాలో పేర్కొన్న వివరాలపై బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు.



ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న బీఎల్వోలు

✷ సర్వే చివరి తేదీ-అక్టోబరు 18
✷ ముసాయిదా జాబితా విడుదల : అక్టోబరు 29
✷ అభ్యంతరాల స్వీకరణ : డిసెంబర్ 24 వరకు
✷ తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 2025 జనవరి 6

యాప్‌లో నమోదు 2025 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ కొత్తగా ఓటరు నమోదుకు అర్హులు. ఇంకా మూడు వారాల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికీ చనిపోయిన చాలా మంది ఓటర్ల పేర్లను తొలగించలేదు. వీటిని తొలగించేందుకు ప్రత్యేకంగా సర్వే చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో అద్దెకు నివాసం ఉంటూ వేరే ప్రదేశాలకు మారిన ఓటర్లు డోర్ నంబర్లను మార్పు చేసుకోవాల్సి ఉండటంతో బీఎల్వోలకు ఆ వివరాలు ఇస్తే వెంటనే మార్చే అవకాశం ఏర్పడుతుంది.

సౌకర్యాలేవీ!



ఆగిరిపల్లిలోని జగనన్నకాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగు కోసం ఇళ్ల ముందు గోతులు తవ్వుకున్నారిలా..

పేదలకాలనీల్లో కనీస సౌకర్యాలు కానరావడం లేదు. సరైన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు పోటెత్తుతోంది. బురదలో ఇళ్లకు వెళ్లేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. సౌకర్యాలు కల్పించాలని గత వైకాపా ప్రభుత్వంలో విన్నవించినా మా మొర ఆలకించలేదని వాపోతున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. -ఈనాడు, ఏలూరు.



తణుకు మండలం వేల్పూరులో రహదారి దుస్థితి



వేల్పూరులోని కాలనీలో కాలువలు లేకపోవడంతో పోటెత్తిన మురుగు

తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతం చేద్దాం : గన్ని



భీమడోలు: ఎమ్మెల్సీ అభ్యర్థిని పరిచయం చేస్తున్న వీరాంజనేయులు

భీమడోలు, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, త్వరలో జరిగే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేద్దామని జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ అధ్యక్షులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను నియోజకవర్గ నాయకులకు వీరాంజనేయులు పరిచయం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలకు ఓటు నమోదుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

జిల్లాలో సగటు వర్షపాతం 8.6 మి.మీ.

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8.30 గంటల మధ్య 8.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల వారీగా.. మండవల్లి 28.4, పెదవేగి 26.4, లింగపాలెం 23.4, కామవరపుకోట 23.2, ఏలూరు రూరల్ 19.8, ముసునూరు 16.4, కైకలూరు 14.6, ద్వారకాతిరుమల 13.2, చింతలపూడి 12.4, నూజివీడు 10.6, ఏలూరు అర్బన్ 10.2, భీమడోలు 10.2, పెదపాడు 9.6, దెందులూరు 9.2, ఆగిరిపల్లి 4.6, ముదినేపల్లి 3.4, చాట్రాయి 2.8, కలిదిండి 2.8 మి.మీ. వర్షం కురిసిందన్నారు.

5, 6 తేదీల్లో బస్సు పాసుల జారీ నిలుపుదల

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు, ఇతరులకు సీజనల్ బస్సు పాసుల జారీని ఈ నెల 5, 6 తేదీల్లో నిలుపుదల చేస్తున్నట్లు ఏలూరు డిపో మేనేజరు బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నందున ఆ రెండు రోజుల్లో పాసులు ఇవ్వడం వీలుకాదన్నారు. ఈ నెల 7 నుంచి యథావిధిగా నెల వారీ, సీజనల్ పాసులు అందిస్తామని పేర్కొన్నారు.

మూషికా.. కాచుకో ఇక



పోడూరు, మార్టేరు, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడం పక్కన పెడితే ఏటా పొలంలోనే స్థిర నివాసం ఏర్పరచుకుని రైతు ఆదాయానికి గండి కొడుతున్న మూషికాలను ఎదుర్కోవడమే పెద్ద సవాలుగా మారుతోంది. ఈ క్రమంలో వ్యవసాయశాఖ జిల్లాలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం రైతులకు ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేయనున్నారు.

- జిల్లాలోని 20 మండలాల్లోని 379 గ్రామాల్లో 1,17,479 హెక్టార్ల పంట, పొలాలు, బోదె భూమిలో ఈ నిర్మూలన ప్రక్రియ చేయనున్నారు.
- దీనికి 1175 కిలోల బ్రోమోడయలిన్ మందుతో విషపు ఎరను తయారు చేసి పంపిణీ చేస్తారు.
- ఎరగా కలిపే నూకలు, నూనె, ఇతర ఖర్చులకు మైనర్ పంచాయతీలు రూ.2 వేలు, మేజర్ పంచాయతీలు రూ.3 వేల చొప్పున నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు వెసులుబాటు ఇచ్చింది.

సామూహికంగా చేస్తే ప్రయోజనం

96 పాళ్ల వరి నూకలతో రెండు పాళ్ల నూనెను బాగా పట్టించి రెండు పాళ్ల బ్రోమోడయలిన్ మందు కలపాలి. ఈ మందును పేపరులో చిన్న పొట్లాలుగా తయారు చేసుకుని ఎలుకల బొరియల్లో(కన్నాల్లో) ఉంచాలి. ఈ పద్ధతిని రైతులంతా సామూహికంగా చేపట్టినప్పుడే ఎలుకలను సమర్థంగా నివారించవచ్చు. తయారు చేసిన మందును వెంటనే వాడాలి.

– డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, సీనియర్ శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మార్టేరు

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, ఆపై కోర్సుల్లో ఉత్తీర్ణులై, 15 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని డీఎల్‌టీసీలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర కరాటే జట్ల ఎంపిక

రాజంపేట, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 1న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభచాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.రమణరాజు తెలిపారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ కరాటే పోటీలో పాల్గొంటారని వివరించారు.

బాలుర జట్టు : బి.సన్యాసిరావు(కృష్ణా), కె.బద్రినాథ్, డి.అరవింద్(కర్నూలు), ఎస్.రవికుమార్, ఎ.భాస్కర్‌రావు, కె.మేధోసాయి అశీష్, ఎస్.కె.నవాజ్ అహమ్మద్, కె.ప్రణీత్, ఎస్.జగన్, ఎం.ప్రణీత్ (విశాఖ), పి.సాయివెంకట శివ, పి.నాగూర్‌వల్లి (చిత్తూరు), వై.వెంకటచలపతి (కడప)లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: తనూజ (నెల్లూరు), ఇ.రేవతి, సుగందిని (కర్నూలు), జి.జయసౌద(వెస్ట్ గోదావరి), ఎన్.సంయుక్త, ఎ.యశశ్వని(పశ్చిమగోదావరి), కె.రేణుక, పి.కీర్తి (విశాఖ), ఎం.నిఖిత, పి.సిరి(అనంతపురం), పి.రాజరాజేశ్వరి(కృష్ణా) ఎంపికయ్యారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 246, చికెన్ స్కిన్‌లెస్ - 256.

- ఉంగుటూరుకు చెందిన సత్యానంద్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం చేస్తున్నారు. 'దసరా' పండగ సందర్భంగా స్వగ్రామానికి రావాలని అనుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్లను బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో చూడగా సీట్లన్నీ ఫుల్ అయినట్లు చూపించింది. ప్రైవేటు ట్రావెల్స్‌కు సంబంధించిన యాప్‌లను పరిశీలించారు. వాటిలో సీట్లు ఖాళీగా ఉన్నాయి. కానీ సాధారణ రోజుల్లో వసూలు చేసే ధరకంటే రెండు నుంచి మూడు రెట్లు అధికంగా చూపిస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో సత్యానంద్ తనతోపాటు భార్య, కుమారుడితో కలిపి మొత్తం మూడు టికెట్లను ఒక ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులో బుక్ చేసుకున్నారు. సాధారణ రోజుల్లో మూడు టికెట్లకు కలిపి రూ.2,100 వరకు ఖర్చయ్యేది. దసరా పండగ రోజుల్లో అదనంగా రూ.2,400 చెల్లించాల్సి వచ్చింది.
- నూజివీడుకు చెందిన మంజుల హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఆమె చదివే కళాశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో కొద్ది రోజుల క్రితం తన స్వగ్రామానికి రైలులో వచ్చారు. ఈనెల 13తో సెలవులు ముగుస్తాయి. 14న కళాశాలకు వెళ్లాల్సి ఉండటంతో 13వ తేదీన బస్సులో ప్రయాణించడానికి టికెట్ బుక్ చేసుకోవాలనుకున్నారు. అప్పటికే టికెట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు బస్సుల్లో ప్రయాణించాలనుకున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకుందామని చూసిన ఆమెకు టికెట్ ధరలు చూసి గుండె గుభేల్‌మంది. నూజివీడు నుంచి హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో రూ.650 నుంచి రూ.800 వరకు ఉండే టికెట్ ధర కాస్తా పండగ రోజుల్లో రూ.1,500 నుంచి రూ.3,000 వరకు చేరింది. చేసేదేమీ లేకపోవడంతో పెద్ద మొత్తాన్ని చెల్లించి ప్రైవేటు బస్సులో టికెట్ బుక్ చేసుకున్నారు మంజుల.

పండగ పేరుతో అదనపు వసూళ్లు

ప్రైవేటు బస్సుల యాజమాన్యాల ఇష్టారాజ్యం



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏటా దసరా, సంక్రాంతి తదితర పండగ రోజుల్లో ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల నుంచి ఇష్టానుసారం సొమ్ము వసూలు చేస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. సాధారణ రోజుల్లో వీటికి పెద్దగా డిమాండ్ ఉండకపోవడంతో ప్రయాణికుల నుంచి నిర్ణీత మొత్తంలో సొమ్మును వసూలు చేస్తుంటారు. పండగ రోజుల్లో మాత్రం వీరిని నియంత్రించలేకపోతున్నారు. ఏ రోజుల్లోనైనా సరే ప్రయాణించే దూరాన్ని బట్టి నిర్ణయించిన టికెట్ల ధరల ప్రకారమే ప్రయాణికుల నుంచి సొమ్మును వసూలు చేయాలనేది నిబంధన. దీన్ని అతిక్రమించే వారిపై రవాణా చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుంది. కానీ ఆ శాఖ అధికారులు ప్రైవేటు బస్సుల యజమానులను నియంత్రించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి

ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం.. 'రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం. పండగ రోజుల్లో ప్రయాణికుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత బస్సుల యజమానులపై కేసులు నమోదు చేస్తాం' అని ఇన్‌ఛార్జి డీటీసీ ఎండీ మదని తెలిపారు.

కొత్తవి అందుబాటులోకి వచ్చేదాకా పాతవి నిర్వహణ

దరఖాస్తుల స్వీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టండి


ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న ముఖేష్ కుమార్ మీనా

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కొత్త మద్యం దుకాణాలు అందుబాటులోకి వచ్చేదాకా ప్రభుత్వ దుకాణాలను కొనసాగించాలని ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. నూతన విధానం అమల్లోకి వచ్చాక మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ, ఇతర వ్యవహారాల్ని పరిశీలించేందుకు గురువారం ఆయన ఏలూరులోని ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చారు. ఎన్ని దరఖాస్తులు అందాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఎక్కువ దుకాణాలకు అనుమతులున్నందున దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్ద ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐఎంఎల్ డిపోనకు వెళ్లి నిల్వలను పరిశీలించారు. కొత్త దుకాణాలు అందుబాటులోకి వచ్చేవరకు ప్రభుత్వ దుకాణాలకు అవసరమైన మేరకు సరఫరా చేయాలన్నారు. కొత్తవి ప్రారంభమయ్యే నేపథ్యంలో ఎక్కువ సరకు అవసరమవుతుంది గనుక ఎంత కావాలో ముందుగానే ఆర్డరు పెట్టుకోవాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. జేసీ ధాత్రిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య, సీఐ ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలకు ప్రోత్సాహం

వీణల తయారీపై తర్ఫీదు

నూజివీడు, న్యూస్‌టుడే: దేశంలో అంతరించిపోతున్న చేతి వృత్తుల్లో ప్రాచీన కళ అయిన వీణల తయారీ ఒకటని, ఈ కళను ప్రోత్సహించేందుకు ఆసక్తి ఉన్న వారికి వీణల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ హ్యాండీ క్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ ప్రమోషన్ అధికారి రవీంద్ర గౌతమ్ తెలిపారు. నూజివీడు మండలం తుక్కులూరులో వీణల తయారీలో శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఏపీ హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి ఐవీ లక్ష్మీనాథ్ మాట్లాడుతూ.. నూజివీడు వీణ అంతరించిపోతున్న కళగా భావించి, భావితరాలకు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో వీణల తయారీలో అయిదు నెలల శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. వీణల తయారీ నేర్చుకునే వారికి అవసరమైన ముడి సరకు అందించడంతో పాటు శిక్షణ కాలంలో రూ.7,500 నగదు ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 20లోగా నూజివీడులోని మాబు వీణల తయారీ కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.



ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

ఏలూరులో 2వ 'వైనాట్' షోరూమ్ ప్రారంభం


షోరూమ్ ప్రారంభిస్తున్న వెంకట కృష్ణాజీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: వైనాట్ 34వ శాఖను, ఏలూరులో 2వ షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ హాజరై వసంతమహల్ కూడలిలో కొత్తగా ఏర్పాటు చేసిన షోరూమ్‌ను ప్రారంభించారు. వైనాట్ మేనేజింగ్ డైరెక్టర్ జె.వెంకటరాయుడు తదితరులు మాట్లాడారు. ప్రారంభ విక్రయాల్లో లక్కీ పాట్ ద్వారా విజేతగా నిలిచిన ఖాతాదారుకు వెంకట కృష్ణాజీ చేతులమీదుగా మిక్సర్ గ్రైండర్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌జీ బ్రాంచి మేనేజర్ కిశోర్, లాయిడ్ రీజినల్ మేనేజర్ హేమసుందర్, హయ్యర్ బ్రాంచి మేనేజర్ అరవింద శర్మ, సోనీ సీనియర్ మేనేజర్ భాస్కర్, శ్యామ్‌సంగ్, ఐఎఫ్‌బీ, బోష్, ఎంఐ, వివో తదితర సంస్థల ఏరియా మేనేజర్లు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

కోటి ఖర్చు చేసినా ఇంతేనా?


విత్తన పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇది భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న సమీకృత ప్రయోగశాల భవనం. వైకాపా హయాంలో దాదాపు రూ.కోటి ఖర్చుతో దీన్ని నిర్మించారు. గత ఏడాది జులైలో అట్టహాసంగా ప్రారంభోత్సవం కూడా చేశారు. కింద వ్యవసాయ, పైన ఆక్వా ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఎంతో ఖరీదైన యంత్ర పరికరాలను సమకూర్చారు. కానీ ఇప్పటికీ కనీసం నీటి వసతి లేకుండాపోయింది. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పలు చోట్ల బీటలు తీసింది. ప్రధాన రహదారి నుంచి ఈ భవనానికి వెళ్లేందుకు సరైన దారి కూడా లేదు. వర్షం వస్తే మోకాలి లోతు నీరు నిలిచిపోతోంది. వ్యవసాయానికి సంబంధించిన విత్తన పరీక్షలు నిర్వహించేటప్పుడు బయట నుంచి డబ్బాల్లో నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా నీటి ఇబ్బందులున్న విషయం వాస్తవమేనన్నారు. నిర్మాణంలో నాణ్యత కూడా లోపించిందని తెలిపారు. అందుకే ఇప్పటి వరకు గుత్తేదారుకు సంబంధిత బిల్లుపై తాను సంతకం చేయలేదని వెల్లడించారు.


భీమవరంలో నిర్మించిన సమీకృత ప్రయోగశాల, బయటి నుంచి తెచ్చుకున్న నీటి డబ్బా

పుణ్యక్షేత్రాల దర్శనాలకు రైలు సదుపాయం కల్పించాలి


శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు కుమార్

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాల దర్శనాలకు వెళ్లేవారి కోసం రైలు సదుపాయం కల్పించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే విజయవాడ యూజర్స్ కమిటీ సభ్యులు జక్కంపూడి కుమార్ నరసాపురం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ, అయోధ్య, శబరిమలైలకు ప్రత్యేక రైళ్లు, హైదరాబాద్‌కు వందేభారత్ స్లీపర్ ట్రైన్, బెంగళూరు వారానికి రెండుమార్లు ప్రత్యేక రైలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే రైలుకు విజయవాడలో కనెక్టింగ్ బోగీలను నరసాపురం నుంచి ఏర్పాటు చేయాలని కోరారు. అరుణాచలం వెళ్లేందుకు కాకినాడ-చెన్నై రైలును తిరువణ్ణామలై వరకు పొడిగించాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై విజయవాడ డీఆర్ఎం నరేంద్ర పాటిల్‌తో చర్చిస్తానని మంత్రి శ్రీనివాసవర్మ హామీ ఇచ్చారన్నారు.

మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగప్రభు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ జయంతి సందర్భంగా తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు 22 మద్యం సీసాలు తీసుకెళ్తున్న బొల్లం దుర్గారావును గుండుగొలను వద్ద అదుపులోకి తీసుకున్నారు. పుదుచ్చేరి రాష్ట్రం నుంచి ఈ మద్యాన్ని అక్రమంగా తీసుకొవచ్చినట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

తల్లిని కొడుతోందని సోదరిపై కత్తితో దాడి


నిందితుడిని పట్టుకుంటున్న స్థానికులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తల్లిని వేధించడంతో పాటు తరచూ ఆమెను కొడుతున్న సోదరిపై తమ్ముడు కత్తితో దాడిచేసిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక శ్రీనివాసపురం రోడ్డులో నివాసం ఉండే దారా ఏసోబు అనే వ్యక్తి తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతడితో పాటు తల్లి, భర్తతో విడిపోయిన సోదరి ఎస్తేరురాణి, ఆమె కుమార్తె కూడా ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఎస్తేరు రాణి తల్లితో గొడవపడుతూ ఆమెను కొడుతోంది. గురువారం ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకోవడంతో తల్లిని కొట్టి ఎస్తేరు రాణి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తాపీ పనికి వెళ్లి ఇంటికి వచ్చిన ఏసోబు ... జరిగిన విషయం తెలుసుకుని కోపోద్రిక్తుడై స్థానిక ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో సోదరి కనిపించడంతో కత్తితో ఆమెపై దాడి చేయడంతో తల, చేతికి రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పాత కక్షల నేపథ్యంలో చేసిన దాడిలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. పెనుమల్లి శివారు సింగరానికి చెందిన బి.సాయి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి గురజ సెంటరులో ఉండగా పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన గోద్రు వీరబాబు కత్తితో దాడి చేశాడు. దీంతో సాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాల వేళ విషాదం

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


సుభాష్ చంద్రబోస్ (పాత చిత్రం)

చేబ్రోలు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా తన పిల్లలతో కలిసి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న వ్యక్తిని మృత్యువు విద్యుత్తు షాక్ రూపంలో కబళించింది. పండగ వేళ ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చేబ్రోలు పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు.. చేబ్రోలుకు చెందిన తుమ్మపాల సుభాష్ చంద్రబోస్ (40) దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక పాత కోట్లమ్మ ఆలయం వద్ద శుభ్రం చేసేందుకు తన పిల్లలతో కలిసి గురువారం వెళ్లారు. నీళ్లతో ఆలయాన్ని శుభ్రం చేసేందుకు మోటారు స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై సుభాష్ చంద్రబోస్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య లలిత, కుమారులు ఆదినారాయణ, నాగబాబు, గీతావాణి ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

రహదారి ప్రమాదంలో వివాహిత..

బుర్గంపాడు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వివాహిత మృతి చెందిన ఘటనలో బుర్గంపాడు పోలీస్ ఠాణాల కేసు నమోదైంది. పెదరావిగూడెం గ్రామానికి చెందిన నడిపింటి సరిత(26)కు అనారోగ్యంగా ఉండడంతో ఆమె భర్త వినోద్‌కుమార్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం మీద భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో సారపాక వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని టూరిస్టు బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సరిత అక్కడికక్కడే మృతి చెందారు. వినోద్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో బంధువులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అత్త సరోజిని ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చిత్రలేఖనం ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పొరుగు సేవల పద్ధతిన పనిచేస్తున్న చిత్రలేఖనం ఉపాధ్యాయుడు మురళీకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఏపీవో, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డీడీ పీవీఎస్ నాయుడు తెలిపారు. ఈ మేరకు జేసీ, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో ధాత్రిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా అతడిని ఉద్యోగం నుంచి తొలగించాలని గిరిజన గురుకుల విభాగానికి జేసీ సిఫార్సు చేశారన్నారు. పాఠశాల నిర్వహణపై అలసత్వంగా ఉంటున్నారని ప్రిన్సిపల్ విజయలక్ష్మిని గురుకులానికి సరెండర్ చేసి, ఆమె స్థానంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీకుమారిని ఇన్‌ఛార్జి బాధ్యతలపై నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

సాంకేతికతతో పెట్టుబడి ఆదా

పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయ సాగులో ఖర్చులు తగ్గించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. సత్యవోలు, సకలకొత్తపల్లిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో సాగులో ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మత్స్య శాఖ జిల్లా అధికారి నాగలింగాచారి చేపల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మండల వినియోగం గురించి వివరించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. ★ పెదవేగి మండలం న్యాయంపల్లి, కొప్పులవారిగూడెం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ముత్యాల ప్రియాంక ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజా దర్బార్ వాయిదా


ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 4న నిర్వహించాల్సిన ప్రజా దర్బార్ వాయిదా పడినట్లు తహసీల్దార్ జి.వి.శేషగిరి తెలిపారు. 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వివరించారు.

వరప్రదాయని.. ఆనందరూపిణి

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం


పత్తేబాద కనకదుర్గమ్మ


పవరుపేట కాశీ అన్నపూర్ణ


వైఎంహెచ్‌ఏ కూడలి వద్ద..


శంకరమఠం వద్ద..

ఏలూరు గ్రామీణ, నగరం, ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, పెదవేగి, పెదపాడు, గణపవరం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలు, పట్టణాలు, గ్రామాల్లోని కూడళ్లలో వేదికలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను కొలువుదీర్చారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఉంగుటూరు గ్రామ దేవత పల్లాలమ్మ, పత్తేపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చల్లాలమ్మ తెల్లపూల అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి


ఏలూరు: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


పత్తేపురంలో ఎమ్మెల్యే ధర్మరాజు


గణపవరంలో..


కైకరంలో..


రాట్నాలకుంటలో..


ఏపూరులో..


గుండుగొలనులో..

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: ఏలూరు వెన్నవల్లివారి పేట నుంచి బీఎస్ఎన్ కాలనీకి వెళ్లే రోడ్డులో నివాసాల ముందున్న కాలువలో నెలల తరబడి పూడిక తీయకపోవడంతో మురుగు పేరుకుపోయింది. దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- ఎన్.వి.ఆర్.మల్లేశ్వరరావు, టీచర్స్ కాలనీ**

సమాధానం: మురుగు కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- శివారెడ్డి, డిప్యూటీ నగర పాలక అధికారి**

సమస్య: ఏలూరు నుంచి పెదపాడు వెళ్లే ప్రధాన దారిలో వంపుల చెరువు ఎదుట ఖాళీ స్థలం పక్కనున్న స్తంభానికి వీధి దీపం పది రోజులుగా వెలగడం లేదు. **- డి.సతీష్‌కుమార్, బాలాయిగూడెం**

సమాధానం: సిబ్బందితో వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: కొత్తూరు రాజీవ్ గృహకల్ప కాలనీ లోపలికి వెళ్లే దారి గుంతలతో అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే గుంతల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. కాలనీ వాసులు మురుగులో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. **- శ్రీనివాసరావు, రాజీవ్ గృహకల్ప కాలనీ**

సమాధానం: ఆ రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, నగర పాలక అధికారి**

దెందులూరు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: కొవ్వలిలోని గాంధీనగర్ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. కొద్దిపాటి వర్షానికే మురుగు రోడ్లపైకి చేరుతుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- మోహన్‌కృష్ణ, కొవ్వలి**

సమాధానం: డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు చేపడతాం. **- రంగనాయకమ్మ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: చాటపర్రులోని కాలనీల్లో దోమల సమస్య ఎక్కువగా ఉంది. దోమ కాటుకు గురై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. **- రమణ, చాటపర్రు**

సమాధానం: దోమలు నివారణకు తగిన చర్యలు చేపడతాం. **- వర్మ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: శాంతినగర్ నాలుగో వీధిలో చాలా కాలం వీధి దీపాలు సరిగా వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. నగర పాలక సంస్థ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. **- లక్ష్మి, శాంతినగర్**

సమాధానం: సిబ్బందిని పంపించి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- శేషగిరి, విద్యుత్తు ఏఈ, ఏలూరు**

స్పందనకు వందనం

వీధి దీపం వెలిగింది.. **ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** ఆర్డీవో కార్యాలయం వెనుక చిన సాయిబాబా గుడి వద్ద నివాసాల ముందున్న వీధి దీపం వెలిగించారు. ఈ విషయమై ఈ నెల 2న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పూడిక తీశారు.. ఏలూరు వంగాయగూడెం నుంచి పెదపాడు వెళ్లే రోడ్డులో లక్ష్మమ్మ చెరువు కాలనీ రామాలయం మార్గంలోని మురుగు కాలువల్లో పూడిక తీశారు. ఈ సమస్యపై గత నెల 27న ప్రచురితమైన వార్తకు నగర పాలక అధికారి భానుప్రతాప్ స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

గోనె సంచుల కొరత తలెత్తకూడదు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణలో గోనె సంచుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్ సూచించారు. ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో పలు అంశాలపై రెవెన్యూ, వ్యవసాయ శాఖలు, పౌరసరఫరాల సంస్థ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కొనుగోళ్లు ప్రారంభించే నాటికి అవసరమైన గోనె సంచులను సమకూర్చుకోవాలన్నారు. ఆదాయం, కుల తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఏవో ఎన్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ దావీదు రాజు, డీటీ స్వర్ణదుర్గ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం సేకరణ వివరాలను ఆర్డీవోకి వివరిస్తున్న ఏవో

భవానీ భక్తులకు అల్పాహారం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: విజయవాడలోని కనకదుర్గమ్మ సన్నిధికి కాలినడకన వెళ్లే భవానీ దీక్ష ధారులకు మార్గం మధ్యలో అల్పాహారం, ప్రథమ చికిత్స అందించేందుకు స్థానిక రామకృష్ణాపురం వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించి భవానీ భక్తులకు అల్పాహారం అందించారు. ఉద్యోగులు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఏవో కృష్ణమూర్తి, ఎంహెచ్‌వో మాలతి తదితరులు పాల్గొన్నారు.


అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

బోరు పనులు ప్రారంభం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని 3వ డివిజన్‌లో గురువారం బోరు తవ్వకం పనులను ఎమ్మెల్యే బడేటి చంటి గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బోరుతో 3 నుంచి 7వ డివిజన్ ప్రజలకు మంచినీటి సమస్య తీరుతుందన్నారు. బాలాజీ, సుమతి, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ధర్నా

భీమడోలు, న్యూస్‌టుడే: టి.నరసాపురం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్త కె.లక్ష్మిని అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ భీమడోలు మండలం పూళ్ల, గుండుగొలను గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలు గురువారం ధర్నాలు చేశారు. ఆ సంఘ నాయకులు పద్మ, నయోమి, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.


పూళ్ల పీహెచ్‌సీ వద్ద

ఉద్యోగులకు సన్మానం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులను గురువారం ఘనంగా సత్కరించారు. నిడమర్రుకు బదిలీ అయిన ఇన్‌ఛార్జి తహసీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్‌ను మండల కళింగ సంఘం ఘనంగా సత్కరించింది. నారాయణపురం, కైకరం పంచాయతీ కార్యదర్శులు జవ్వాది నాగేశ్వరరావు, నాగేంద్ర కుమార్‌లను ఆయా గ్రామాల సర్పంచులు దిడ్ల అలకనంద, సలగాల గోపి, పంచాయతీల పాలకవర్గ సభ్యులు సన్మానించారు.

బదిలీలు సర్వసాధారణం

పెదపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ఇన్‌ఛార్జి తహసీల్దార్ సునీత అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందికి గురువారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఎక్కడైనా బాధ్యతాయుతంగా పని చేయాల్సిందేనన్నారు. వీఆర్వోల సంఘం పెదపాడు మండల అధ్యక్షుడు నటరాజన్‌దాస్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు జూట్‌మిల్లు సమీపంలోని ధర్మభేరి ప్రాంగణంలో జనసేన నాయకుడు నారా శేషు దంపతులు నిర్వహిస్తున్న శ్రీనివాస వైభవోత్సవాల్లో భాగంగా గురువారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన బృందం భజన కార్యక్రమం నిర్వహించింది.

పేదలకు బాసటగా సీఎం సహాయనిధి

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరం మండలం కేశవరానికి చెందిన కొలపర్తి వేణు ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతుండటంతో జనసేన పార్టీ అధ్యక్షుడు వేగేశ్న వెంకట శ్రీనివాసరాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన చొరవ తీసుకుని సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. దీనికి సంబంధించిన చెక్కును నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో వేణు భార్య పద్మకు గురువారం అందజేశారు.

ఆర్థిక సాయం.. కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరంలోని పాత హరిజనపేటలో ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు కాంతమ్మకు కైకరం రంగా యువసేన గౌరవ అధ్యక్షుడు, జనసేన నాయకుడు వెజ్జు వెంకట సుబ్బారావు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అరుంధతి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత సహాయం.. భీమడోలు, న్యూస్‌టుడే: రెండు పేద కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు గురువారం సాయం అందించారు. భీమడోలు వెలంపేటలో అనారోగ్యంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి నిత్యావసరాలు, నూతన వస్త్రాలు, సూరప్పగూడెంలో ప్రమాదవశాత్తు కాలు విరిగి బాధపడుతున్న వ్యక్తికి రూ.5 వేల సాయం అందజేశారు. సంస్థ ప్రతినిధులు గుల్ల అప్పారావు, వెజ్జు కొండలరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెక్షన్ 2 క్లాజ్ 1, క్లాజ్ 2లో పొందుపరిచిన 42వ నంబరు సవరణ బిల్లును మార్చాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించారు. శుక్రవారం కూడా విధుల బహిష్కరణ కొనసాగుతుందని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామారావు తెలిపారు. సవరణ బిల్లులో న్యాయవాదులు సంవత్సరానికి కోర్టులో 12 హియరింగ్‌లకు హాజరుకావాలని 5 నుంచి అంతకంటే ఎక్కువ వకాల్తాలు ఫైలు చేయాలని పొందుపరిచారు. దీన్ని న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. సవరణ బిల్లులో వాటిని తొలగించాలని యథావిధిగా కొనసాగించాలని కోరుతున్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించొద్దంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏలూరులో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. వసంత మహల్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, డేగా ప్రభాకర్‌రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకుడు రాజనాల రామ్మోహనరావు, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను విక్రయించే ప్రయత్నాలు విరమించుకోకపోతే ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షకు ఏఐటీయూసీ నేతలు చలసాని వెంకట రామారావు, రెడ్డి శ్రీనివాసరావు డాంగే తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల లారీలు స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న రెండు లారీలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఇన్‌ఛార్జి ఎస్సై సతీష్ తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చెరువులకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీ యజమానులు, డ్రైవర్, క్లీనర్లపై కేసులు నమోదు చేశామని వివరించారు.

పేదింటి పిల్లలు.. క్రీడల్లో మెరికలు

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్‌లో రాణింపు


పాఠశాలలో సాధన చేస్తున్న విద్యార్థులు

భీమడోలు, న్యూస్‌టుడే

వారంతా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చారు. పేద, రైతు కుటుంబాలకు చెందిన వీరు క్రీడాసక్తిని పెంపొందించుకుంటూ అందుబాటులోని వనరులతో సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. మట్టిలో మాణిక్యాలుగా నిలుస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆటల్లో నైపుణ్యం చాటుతూ బహుమతులందుకుంటున్నారు.

ప్రతిభ చాటుతూ.. భీమడోలు మండలం గుండుగొలనులోని శ్రీ మావులేటి సోమరాజు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో ప్రతిభ చాటుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు సాఫ్ట్, బేస్‌బాల్ క్రీడల్లో విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించటంతో పాటు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల్లో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న పలువురు బాలురు, బాలికలు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన గంటా అజయ్ సాఫ్ట్‌బాల్‌లో విశేషంగా రాణిస్తూ గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొన్నారు. ఈ ఏడాది పెదవేగిలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు పది మంది ఎంపికవడం గమనార్హం. పాఠశాలలో క్రీడా వసతులు నామమాత్రంగా ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకుంటూ వ్యాయామ ఉపాధ్యాయులు అందిస్తున్న తర్ఫీదు, ప్రోత్సాహంతో పోటీల్లో రాణిస్తున్నారు.

గ్రామీణ నేపథ్యం.. గుండుగొలను ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గంటా అజయ్, బి.వీరమణికంఠ, బి.తేజ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్- 14 విభాగంలో ఎం.శశికిరణ్ (8వ తరగతి), ఎన్.కల్యాణ్ బాబు (7వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గ్రామీణ నేపథ్యం, పేదరికం ఇవేమీ వారి క్రీడాసక్తికి ఆటంకం కాలేదు. చదువుతోపాటు ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో విజయం దిశగా దూసుకెళ్తున్నారు. తమ ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడేలా క్రీడల్లో రాణించి పతకాలు సాధిస్తామని, పాఠశాలకు గుర్తింపు తీసుకొస్తామని విద్యార్థులు పేర్కొంటున్నారు.


రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలికలు, బాలురు

బాలికల ప్రతిభ.. పదో తరగతి చదువుతున్న జె.శ్రీలక్ష్మీప్రసన్న, వై.నాగదుర్గ అండర్-17, 9వ తరగతి చదువుతున్న ఎస్.వెంకటలలిత, ఐ.దుర్గాభవాని, 8వ తరగతి చదువుతున్న డి.అనన్య అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు జిల్లా జట్లకు ఎంపికవడం విశేషం. వీరి తల్లితండ్రులు వ్యవసాయ కూలీలు. నిత్యం ఖాళీ సమయాల్లో సాధన చేస్తూ, వ్యాయామోపాధ్యాయుల సూచనలు, సలహాలు క్రీడల్లో సత్తా చాటుతున్నారు.


శిక్షణ పొందుతున్న బాలలు

శిక్షణ శిబిరం ప్రారంభం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దసరా సెలవులను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బాలలకు ఉచిత శిక్షణ శిబిరం గురువారం ప్రారంభించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో బాలబాలికలకు బియ్యం గింజలపై అక్షరాలు రాయడం, అగ్గిపుల్లలపై బొమ్మలు వేయడం నేర్పించనున్నారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ బియ్యం గింజలపై అక్షరాలు రాయడాన్ని డి.శివప్రసాద్, అగ్గిపుల్లలపై బొమ్మలు వేయడానికి ఎం.సురేశ్ నేర్పిస్తారన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు ఏఆర్‌డీజీకే ఉన్నత పాఠశాలలో బాలలకు కర్రసాములో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాలొద్దు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానాన్ని సవరించాలని, నివాస ప్రాంతాల మధ్య దుకాణాలు పెట్టొద్దని కోరుతూ అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు ఏలూరులోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పర్యవేక్షకురాలికి గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి మాట్లాడుతూ ఇప్పటికే మద్యం కారణంగా సంసారాలు పతనమవుతున్నాయన్నారు. దుకాణాల నిర్వహణకు సమయపాలన విధించాలని, నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.శారద, సీహెచ్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పర్యవేక్షకురాలికి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

షెల్టర్లున్నా బస్సులు ఆగవు

★ ఆగేచోట నిలువ నీడా ఉండదు
★ ఏలూరు నగరంలో ఇదీ దుస్థితి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్లు ఏర్పాటు చేశారు. వీటి వద్ద బస్సులు ఆగవు.. షెల్టర్లు లేని చోట ఆగుతుంటాయి. ఈ కారణంగా ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు ఎక్కేందుకు నిరీక్షించేటప్పుడు కూర్చునేందుకు, నిలుచునేందుకు నిలువ నీడ లేక నానా అవస్థలు పడుతున్నారు.

ఏలూరు నగరానికి ప్రతిరోజూ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎంతోమంది వచ్చివెళ్తుంటారు. నగరం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లేవారు... ఏలూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు బస్సులు ఎక్కేందుకు వేచి చూస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఎక్కువసేపు ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ క్రమంలో కనీసం కూర్చునేందుకు చోటు లేనందున ఇబ్బందులు తప్పడం లేదు. అగ్నిమాపక కేంద్రం, వసంతమహల్, కోర్టు సముదాయం, బస్టాండు, విజయవాడ వైపు వెళ్లే దారిలో కండ్రికగూడెం కూడలి ఇలా అనేకచోట్ల షెల్టర్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే తంగెళ్లమూడి కూడలిలోనూ బస్సు షెల్టర్ లేదు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి వైపు వెళ్లే ప్రయాణికులదీ ఇదే పరిస్థితి. కొన్నిచోట్ల ఉన్నా సౌకర్యవంతంగా లేక వినియోగించుకోలేకపోతున్నారు.


ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో ఇలా..

నిరుపయోగంగా ..

నగరంలోని కొన్ని బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రధాన రహదారిలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలో షెల్టర్ ఏర్పాటుచేశారు. అగ్నిమాపక కేంద్రం కూడలిలో బస్సులు ఎక్కే ప్రయాణికులంతా ఇక్కడికొచ్చి వినియోగించుకుంటారని భావించారు. అక్కడ బస్సులు ఆగకపోవడం.. ఎవరూ రాకపోవడంతో అది నిరుపయోగంగా ఉంటోంది. అలాగే తితిదే కల్యాణ మండపం సమీపంలో బస్‌షెల్టర్ నిర్మించినా వినియోగం లేక తొలగించారు. కర్రవంతెన కూడలిలో బస్టాప్ ఉన్నా ప్రయాణికులు వినియోగించుకోవటం లేదు. వన్‌టౌన్ పరిధిలోకి వస్తే కైకలూరు, చాటపర్రు రోడ్లలో షెల్టర్లు లేవు. ప్రతిరోజు వేలాది మంది లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం కురిసిందంటే నిలువునా తడవాల్సిందే.. లేదంటే పక్కనున్న దుకాణాల్లోకి తలదాచుకోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలని.. ఎక్కడెక్కడ ఎక్కువ మంది ప్రయాణికులు బస్సులు ఎక్కుతుంటారో అక్కడ షెల్టర్లు ఏర్పాటు చేయాలని నగరంతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


అగ్నిమాపక కేంద్రం కూడలిలో కూర్చునేందుకు సౌకర్యం లేక ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఈ విషయమై నగర కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా నగరంలో ఎక్కడెక్కడ బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలో పరిశీలిస్తామని, ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు.



ప్రధాన మార్గం.. గుంతలమయం

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పత్తేపురం- తోకలపల్లి ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. సుమారు అయిదు కిలోమీటర్ల ఈ మార్గం గుంతల మయమైంది. తోకలపల్లి, భైనేపల్లి, ఆముదాలపల్లి, చిననింద్రకొలను గ్రామాల ప్రజలకు ఇది ప్రధాన రహదారి. ప్రస్తుతం దారుణంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

పోలవరం

•పోలవరం • చింతలపూడి

రహదారులు అభివృద్ధి చేయాలంటూ ఆందోళన


రేచర్లలో నిరసన తెలుపుతున్న నాయకులు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలంలో ప్రధాన రహదారులు అభివృద్ధి చేయాలంటూ సీపీఐ నాయకులు రేచర్లలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గురవయ్య మాట్లాడుతూ యర్రగుంటపల్లి, రాఘవాపురం, టి.నరసాపురం ప్రధాన రహదారి ఛిద్రంగా మారడంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేచర్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై కుటుంబరావు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి విరమింపజేయించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం, రాజుపోతేపల్లి విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతుల దృష్ట్యా వాటి పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం విద్యుత్తు ఈఈ రాధాకృష్ణ తెలిపారు.

'విత్తన పరిశోధన క్షేత్రం భూమి సర్వే చేయండి'

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అల్లంచర్లరాజుపాలెంలోని విత్తన పరిశోధన క్షేత్రం భూమిని శుక్రవారం నుంచి సర్వే చేయించి వ్యవసాయ శాఖకు అప్పగించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశించారు. గ్రామంలోని సదరు భూమిని గురువారం ఆయన పరిశీలించి రెవెన్యూ, పోలీసు అధికారులతో మాట్లాడారు. ఎటువంటి గొడవలు జరగకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి : 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి కొత్త బస్టాండ్ చుట్టు పక్కల పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. దోమలు పెరగడంతో పాటు, విష సర్పాలు సంచరిస్తున్నాయి. **- హరిప్రసాద్, స్థానికుడు**

సమాధానం: బస్టాండ్ పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- రాజా, సచివాలయ కార్యదర్శి, చింతలపూడి**

ఇన్‌ఛార్జి ఎక్సైజ్ సీఐగా సత్యవతి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ఎక్సైజ్ సీఐగా సత్యవతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐని రాజోలు బదిలీ చేశారు. అలాగే పలువురు కానిస్టేబుళ్లను బదిలీ చేసి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు.

కొయ్యలగూడెం ఎంపీడీవోగా కిరణ్‌కుమార్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం ఎంపీడీవో ఆర్వీ శ్రీలక్ష్మి గణపవరానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తణుకు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ కొయ్యలగూడెం ఎంపీడీవోగా నియమితులయ్యారు.

ఉపాధి పథకం మరింత పారదర్శకంగా..!

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడికి చెందిన గాలంకి అనీల్ ఉపాధి కూలీ. క్రమం తప్పకుండా పనులకు వెళుతుంటాడు. వేతనం కోసం నిత్యం దగ్గర్లోని తపాలా, ఉపాధి కార్యాలయాలకు చుట్టూ తిరిగే వాడు. అయితే ఎప్పుడు నగదు పడుతుందో తెలియని పరిస్థితి.


పనులు చేస్తున్న కూలీలు

ఇక నుంచి ఆ అవసరం ఉండదు

జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్ రేగా' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకునే వీలుంది. ఇప్పటి వరకు కూలీలు వారికి ఏ సమాచారం కావాలన్నా ఎంపీడీవో, తపాలా, ఉపాధి హామీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఇక నుంచి ఆ అవసరం ఉండదు. చరవాణి ఉన్న ప్రతి ఒక్కరూ సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు.

ఎలాగంటే...


గూగుల్ ప్లేస్టోర్ ఓపెన్ చేసి జన్‌మన్ రేగా (జేఏఎన్ఎంఏఎన్ఆర్ఈజీఏ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పనిచేసిన రోజులు, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమైందో తెలుస్తుంది. ఒక వేళ వేతనం జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. దాంతో పాటు ఉపాధి పథకంలో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.

ఫిర్యాదుకూ అవకాశం

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతిపై, నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పనిచేసినా, సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉన్నాయి. జన్‌మన్ రేగా యాప్‌పై గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీ గ్రామ సభల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. చాలా మందికి యాప్ ఉన్నట్లు తెలియదు.

చాలా ఉపయోగకరం

'జన్‌మన్ రేగా యాప్ ఉపాధి కూలీలకు చాలా ఉపయోగకరం. వేతనాలకు సంబంధించిన వివరాలను చరవాణిలో చూసుకోవచ్చు. యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం' అని డ్వామా పీడీ ఎ.రాము తెలిపారు.



లక్ష్మీమంగను విధుల్లోకి తీసుకుంటాం: ఎమ్మెల్యే

టి.నరసాపురం, న్యూస్‌టుడే: తొలగించిన టి.నరసాపురం పంచాయతీ గండిగూడెం ఆశా కార్యకర్త లక్ష్మీమంగను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఇచ్చిన హామీతో ఆశా కార్యకర్తలు వారం రోజులుగా చేస్తున్న ఆందోళనను గురువారం విరమించారు. ఈ విషయమై టి.నరసాపురం వచ్చిన ఎమ్మెల్యేతో సీఐటీయూ ఆధ్వర్యంలో సంప్రదింపులు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలుంటే అధికారుల దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ లక్ష్మీమంగను వేధించిన అధికారులను సస్పెండ్ చేయాలని, తప్పుడు కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అన్ని విషయాలపై అధికారులతో విచారణ జరిపిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గండిగూడెం గ్రామస్థులు మాత్రం లక్ష్మీమంగ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఆమెను తొలగించాలని కోరారు. ★ విధుల నుంచి తొలగించిన లక్ష్మీమంగను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు మండలాల్లో ఆశా కార్యకర్తలు ఆందోళనలు చేశారు.


కనకదుర్గ అలంకరణలో జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ


బాలాత్రిపుర సుందరిగా జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ


జంగారెడ్డిగూడెం గంగానమ్మ ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు


స్వర్ణ కవచాలంకృత నూకాంబికాదేవిగా నూకాలమ్మ


జ్ఞాన సరస్వతి మాత


దేవీపట్నం శ్రీమహాలక్ష్మి అమ్మవారు

దేవీ రూపం.. సౌభాగ్య దీపం!

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మకు సారె సమర్పించారు. ★ బాలాత్రిపుర సుందరీ అలంకరణలోని జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారిని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దర్శించుకుని పూజలు చేశారు. **- న్యూస్‌టుడే, బృందం**


బాలాత్రిపుర సుందరీ అలంకరణలో చాముండేశ్వరి


పోలవరంలో వాసవీకన్యకాపరమేశ్వరి


కొయ్యలగూడెం కనకదుర్గమ్మ


బయ్యనగూడెం శ్రీచక్రసహితకనకదుర్గమ్మ


కుంకుళ్లమ్మకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

సస్యరక్షణ చర్యలపై అవగాహన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలను ఆశించే తెగుళ్లు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు అన్నారు. బయ్యనగూడెం, యర్రంపేట గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉద్యాన శాఖ అధికారి ధీరజ్‌లక్ష్మణ్, పశువైద్యాధికారి శ్రీనివాసన్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన ప్రస్తుతం ఏలూరు జిల్లా, చింతలపూడి నగర పంచాయతీ కాపురస్తులు నడిపల్లి సత్యనారాయణ గారి భార్య శ్రీదేవి గారు నాకు ఇచ్చిన సంజాయిషీ పైన ఎల్లరకు తెలియజేయునది ఏమనగా..

పైన తెలిపిన నా క్లయింటు చింతలపూడి రెవిన్యూ గ్రామం తాలూకా యీ దిగువ షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని సదరు చింతలపూడి గ్రామకాపురస్తులు అయిన లేటు చీదరాల వెంకటేశ్వరరావు గారి కుమారుడు చెన్నారావు గారి వల్ల క్రయం పొంది దస్తావేజు నెంబర్ 3998/2018గా చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో ది. 26-07-2018వ తేదీన రిజిస్ట్రరీ చేయించుకొనియుండి, సదరు షెడ్యూలు ఆస్తిని అదే రోజు నా క్లయింటు స్వాధీనం పొందియున్నారు. అప్పటి లగాయతు యీ రోజు వరకు సదరు ఆస్తి నా క్లయింటు సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కుభుక్తములోనే ఉన్నది. సదరు ఆస్తిని నా క్లయింటు విక్రయించుటకు సిద్ధముగా ఉన్నారు. ఇందును గూర్చి ఎవరికైననూ అభ్యంతరం, ఆక్షేపణ ఉన్న యెడల, క్రింది తెలిపిన అడ్రస్‌కు ది. 14-10-2024వ తేదీ లోగా వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినదిగా ఇందుమూలముగా ప్రకటన చేయడమైనది.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్-డిలో చేరిన చింతలపూడి మండలం, చింతలపూడి పంచాయతీ, చింతలపూడి గ్రామం తాలూకు జిరాయితీ మెరక నివేశన స్థలము **రి.స.నెం. 687-1-ఎ-1-ఎ1, రి.సం.నెం. 687-2బి-1-ఎ-1ర్లు దాఖలా య.0-18 1/2ట్లు లేక చ.గ. 896లు** స్థలమునకు హద్దులు:

తూర్పు: అ. 135.0లు - ఈ స్థలములోనికి, ఇతర స్థలములలోనికి రాకపోకల నిమిత్తం, అనాధిగా ఏర్పాటు చేయబడి, అమలులోయున్న యిరువది అయిదు అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** అ. 60.లు - చింతలపూడి టు కనుపడె జిల్లా పరిషత్ తారురోడ్డు, **పడమర:** అ. 135.లు - ప్రభుత్వ భూమి, **ఉత్తరం:** అ. 60.లు - పెన్మెత్స నాగ వెంకట ఉష గారి స్థలము.

యీ హద్దుల మధ్య గల య.0-18 1/2ట్లు కు సరియగు హె.0-074ర్లు లేక చ.గ. 896లు ర్లు స్థలమున్నూ

యిందుకు తూర్పువైపున గల రోడ్డు వెంబడిన్నీ, దక్షిణం వైపు గల తారురోడ్డు వెంబడిన్నీ సదరు రోడ్లలో మిగిలిన హక్కుదారులతో పాటు నా క్లయింటు, నా క్లయింటు తాలూకు మనుష్యులు, పశువులు, వాహనములు వగైరాలు పై షెడ్యూలు భూమిలోనికి రాకపోకలు జరిపే దారి హక్కుతో సహాయున్నూ,

యిందలి తరు జలనిధి నిక్షేప పాషాణాది నా క్లయింటుకు గల యావత్తు ఈజిమెంటు హక్కులతో సహా.

గమనిక: ప్రకటన చేయుటలో అచ్చు తప్పులు జరిగిన యెడల వాటిని సరిచేసుకొను హక్కును నా క్లయింటు వద్దనే ఉంచుకోవడమైనది.

సం/- **గోలి శ్రీనివాసరెడ్డి,** అడ్వకేట్
వెలగలపల్లి గ్రామం & పోస్ట్
వయా. ప్రగడవరం, చింతలపూడి మండలం
ఏలూరు జిల్లా, 534461, ఫోన్ నెం: 81859 18515

చింతలపూడి
ది. 04-10-2024

ప్రకటన

నా క్లయింట్ అయిన ప్రస్తుతం ఏలూరు జిల్లా, చింతలపూడి నగర పంచాయతీ కాపురస్తులు (లేటు) నడిపల్లి సోమశేఖరరావు గారి కుమారుడు సత్యనారాయణ గారు నాకు ఇచ్చిన సంజాయిషీ పైన ఎల్లరకు తెలియజేయునది ఏమనగా..

పైన తెలిపిన నా క్లయింటు చింతలపూడి రెవిన్యూ గ్రామం తాలూకా యి దిగువ షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని సదరు చింతలపూడి గ్రామకాపురస్తులు అయిన లేటు చీదరాల వెంకటేశ్వరరావు గారి భార్య 1. అరవాలమ్మ, వీరి కుమారులు 2. రవికుమార్, 3. రమేష్ గార్ల తరపున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ అయిన లేటు చీదరాల వెంకటేశ్వరరావు గారి కుమారుడు చెన్నారావు మరియు చీదరాల వెంకటేశ్వరరావు గారి కుమారుడు చెన్నారావు అను నలుగురి వల్ల క్రయం పొంది దస్తావేజు నెంబర్ 6238/2019గా చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో ది. 28-11-2019వ తేదీన రిజిస్ట్రరీ చేయించుకొనియుండి, సదరు షెడ్యూలు ఆస్తిని అదే రోజు నా క్లయింటు స్వాధీనం పొందియున్నారు. అప్పటి లగాయతు యీ రోజు వరకు సదరు ఆస్తి నా క్లయింటు సంపూర్ణ స్వాధీన అనుభవ హక్కుభుక్తములోనే ఉన్నది. సదరు ఆస్తిని నా క్లయింటు విక్రయించుటకు సిద్ధముగా ఉన్నాడు. ఇందును గూర్చి ఎవరికైననూ అభ్యంతరం, ఆక్షేపణ ఉన్న యెడల, క్రింది తెలిపిన అడ్రస్‌కు ది. 14-10-2024వ తేదీ లోగా వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినదిగా ఇందుమూలముగా ప్రకటన చేయడమైనది.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్-డిలో చేరిన చింతలపూడి మండలం, చింతలపూడి పంచాయతీ, చింతలపూడి గ్రామం తాలూకు జిరాయితీ మెరక నివేశన స్థలము **రి.స.నెం. 1190-1లో య. 2-06 ట్లు పూరాలో చ.గ. 800** లు స్థలమునకు హద్దులు-

తూర్పు: అ. 80.0లు - యిరువది అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** అ. 90.లు - కోడే సత్యనారాయణ గారి స్థలం, **పడమర:** అ. 80.లు - యిరువది అయిదు అడుగుల వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం:** అ. 90.లు - ముప్పది మూడు అడుగుల వెడల్పు గల రోడ్డు.

యీ హద్దుల మధ్య గల చ.గ.800లుకు సరియగు చ.మీ. 668.88 ర్లు స్థలమున్నూ

యిందుకు ఆనుకొనియున్న నా క్లయింటుకు అమ్మినవారిచే ఏర్పాటు చేయబడి, అమలు జరుగుచున్న రోడ్ల వెంబడి రాకపోకలు జరిపే దారి హక్కులతో సహాయున్నూ,

యిందలి తరు జలనిధి నిక్షేప పాషాణాది నా క్లయింటుకు గల యావత్తు ఈజిమెంటు హక్కులతో సహా

గమనిక: ప్రకటన చేయుటలో అచ్చు తప్పులు జరిగిన యెడల వాటిని సరిచేసుకొను హక్కును నా క్లయింటు వద్దనే ఉంచుకోవడమైనది.

సం/- **గోలి శ్రీనివాసరెడ్డి,** అడ్వకేట్
వెలగలపల్లి గ్రామం & పోస్ట్
వయా. ప్రగడవరం, చింతలపూడి మండలం
ఏలూరు జిల్లా, 534461, ఫోన్ నెం: 81859 18515

చింతలపూడి
ది. 04-10-2024

'గిరిజనుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలి'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతాల్లోని గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య కోరారు. పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుట్టాయగూడెం మండలం విప్పలపాడులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు పట్టి పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. నాయకులు కారం దారయ్య, జేవీ రమణరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలను సత్వరమే చెల్లించాలని కోరుతూ నిరసన ప్రదర్శన చేశారు.


నినాదాలు చేస్తున్న కృష్ణచైతన్య, పారిశుద్ధ్య కార్మికులు

ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటాం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తాడువాయిలో చెరువులు, కుంటలు, రహదారి అంచుల్లో ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి సునీల్ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామంలోని పలు చెరువులు ఆక్రమణల్లో ఉన్నాయని, వాటిని తొలగిస్తేనే మురుగు, వర్షపు నీటి సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. దీనిపై కార్యదర్శి మాట్లాడుతూ తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పునరావాసం కల్పించాలి

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని సీపీఎం కోరింది. ఆ పార్టీ వేలేరుపాడు మండల శాఖ సమావేశం గురువారం రుద్రంకోటలో నిర్వహించారు. ఎస్కే మైబు, నాగమణి పాల్గొన్నారు.

అందని కందిపప్పు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రేషన్ పంపిణీ మొదలై మూడు రోజులైనా జంగారెడ్డిగూడెం అర్బన్‌తో పాటు గ్రామీణ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు కంది పప్పు సరఫరా కావడం లేదు. జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ గోదాముకు సరిపడా సరకు రాకపోవడంతో ఇబ్బంది తలెత్తింది. సుమారు 30 టన్నులు అవసరమైతే అందుబాటులో ఉన్న 3 టన్నులను డీలర్లకు సర్దారు. సరిపడా కంది పప్పు గురువారం వచ్చిందని గోదాము ఇన్‌ఛార్జి సాయిబాబా తెలిపారు.





వృథా.. పట్టదా..!

కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. మోటారు వేసిన ప్రతిసారి ట్యాంకు నిండి ఇలా నీరు పోతోందని స్థానికులు చెబుతున్నారు. ట్యాంకు ఎదురుగా ఉన్న గోడపై నేలరాలే ప్రతీ నీటి బొట్టు.. రేపటి కోసం దాచిపెట్టు.. అనే నినాదం ఉండడం విశేషం. **- ఈనాడు, కొయ్యలగూడెం**

తవ్వారు.. వదిలేశారు..!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్వి వదిలేస్తున్న గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. వారాల తరబడి పూడ్చకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉప్పలమెట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో యూపీహెచ్‌సీ సమీపంలోనూ పది రోజుల కిందట తవ్వి వదిలేశారు. పైపులైన్ మరమ్మతులు పూర్తి చేసి గుంతలు పూడ్పించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ నరేంద్రకుమార్ తెలిపారు.


యూపీహెచ్‌సీ సమీపంలో..

చికిత్స పొందుతూ మృతి

లింగపాలెం, ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగపాలెం మండలం ధర్మాజీగూడేనికి చెందిన దేవినేని పానకాల రావు (73)కు మతిస్థిమితంగా ఉండదు. ఈ నేపథ్యంలో ఈ నెల 2న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకాతిరుమల మండలం బుట్టాయగూడేనికి చెందిన బి.గాంధీ(46) కడుపు నొప్పితో బాధపడుతూ గత నెల 30న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో చోరీపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కొడాలివారి వీధిలో నివాసముంటున్న చావలి వెంకటేశ్వర్లు గత ఆగస్టు 18న కుటుంబంతో కలిసి విజయవాడ వెళ్లారు. తిరిగి అదే నెల 21న వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. పడక గదిలోని బీరువాలో దాచిన 15 గ్రాములు బంగారు వస్తువులు మాయమయ్యాయి. దీనిపై బాధితుడు గురువారం జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించిన మహిళలపై..

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో కామవరపుకోట మండలం జలపావారిగూడేనికి చెందిన ఆరుగురు మహిళలు ఒకరిపై మరొకరు గురువారం దూషించుకుంటూ ప్రజలకు అసౌకర్యం కలిగించారు. దీనిపై అంకాలంపాడు వీఆర్వో ఎస్కే నాగూర్‌వలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపారు.

పూరిల్లు దగ్ధం

వేలేరుపాడు, న్యూస్‌టుడే: మండలంలో కన్నాయిగుట్టకు చెందిన కుంజా ముత్యాలు అనే వ్యక్తికి చెందిన పూరిల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో గురువారం దగ్ధమైంది. విలువైన సామగ్రి అంతా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణాపాయం తప్పింది. ఆస్తి నష్టం సుమారు రూ.2 లక్షల ఉంటుందని అధికారులు తెలిపారు.

నూజివీడు

•నూజివీడు •కైకలూరు

కాంట్రాక్టు అధ్యాపకులకు జీవో 110 అమలు చేయాలి

నూజివీడు, న్యూస్‌టుడే: కాంట్రాక్టు అధ్యాపకులకు జీవో 110 అమలు చేయాలని కృష్ణా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు నూజివీడులో గురువారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో జీవో 110 అమలు చేస్తున్నారని, కృష్ణా విశ్వవిద్యాలయం అధికారులు కొందరికే అమలు చేసి, మరికొందరికి వర్తింపజేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



నినాదాలు చేస్తున్న అధ్యాపకులు

6న కైకలూరులో ఉచిత వైద్య శిబిరం

కైకలూరు, న్యూస్‌టుడే: ఓమో జయాః సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న కైకలూరు తాలూకా కూడలిలోని ఎన్జీవోస్ హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఓం నమోస్తుతే క్షేత్రం సభ్యులు గురువారం తెలిపారు. పలు ప్రముఖ ఆసుపత్రులకు చెందిన వైద్య బృందం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలందిస్తారని పేర్కొన్నారు.

ముసునూరు, న్యూస్‌టుడే: వేల్పుచర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ఏలూరు ప్రభ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దానిని సర్పంచి పుట్ల మోహనరావు ప్రారంభించారు. శిబిరంలో 155 మంది రోగులను వైద్యులు పి.సునీల్, సందీప్ వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268 | కలిదిండి: 90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం కోటపాడు ఎస్టేట్ రహదారి నుంచి మైలవరం వెళ్లే రహదారి మధ్యలో మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతుంది. **- వెంకటేశ్వరరావు, నూజివీడు**

సమాధానం: పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **- లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ**

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: ముసునూరు తూర్పు వైపు ఆంజనేయస్వామి ఆలయం వద్ద తాగునీటి చేతి పంపు మరమ్మతుకు గురైంది. అధికారులు స్పందించి బోరు వినియోగంలోకి తీసుకురావాలి. **- నరేశ్, స్థానికుడు**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి చేతి పంపునకు మరమ్మతులు చేయిస్తాం. **- వెంకట సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: కైకలూరు ఆర్టీసీ బస్టాండు ఇన్ గేట్ వద్ద పంచాయతీ వీధి దీపం కొన్ని రోజుల నుంచి సక్రమంగా వెలగడం లేదు. ప్రయాణికులతో పాటు స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. **- అబ్దుల్ కరీమ్, కైకలూరు**

సమాధానం: వెలగని వీధి దీపం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. **- వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో**

పూడిక తీశారు

స్పందనకు వందనం

ముసునూరు, న్యూస్‌టుడే: చింతలవల్లిలో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఇది గురువారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి నీరజ స్పందించి మురుగు కాలువల్లో పూడిక తీయించారు.

పావలా వడ్డీ రుణాలపై అవగాహన కల్పించాలి



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏసురాజు

కైకలూరు, న్యూస్‌టుడే: డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పావలా వడ్డీ రుణాలపై బ్యాంకు అధికారులు అవగాహన కల్పించాలని తెదేపా రాష్ట్ర వడ్డి సాధికారక కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. ఈమేరకు కొల్లేరు లంక గ్రామాల్లో డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గురువారం మండలంలోని ఆలపాడు యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎస్.రామినాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మహిళలు రుణ చెల్లింపులు చేస్తున్న సమయంలో ఖాతా పుస్తకాలపై నగదు జమ చేసినట్లు ముద్రించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ప్రింటర్ పని చేయని కారణంగానే సమస్య వచ్చిందని, మరమ్మతుల అనంతరం ఖాతా పుస్తకాలపై వివరాలు ముద్రిస్తామని మేనేజర్ తెలిపారు. జయమంగళ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతా వారిష్టం!



- పర్యవేక్షణ కరవు.. సమస్యల దరువు
- పేరుకే బోర్డుపై ధరలు
- కైకలూరు రైతు బజారులో ఇదీ పరిస్థితి

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే

ఇష్టమైతే కొను కష్టమైతే మానుకోండి ఇది కైకలూరు రైతు బజార్‌లో వ్యాపారులు వినియోగదారులతో ప్రవర్తించే తీరు. బోర్డులో కూరగాయల ధరలకు వ్యాపారులు అమ్మే దానికి పొంతన లేకపోవడంతో ఇది రైతు బజారా? లేక సాధారణ మార్కెట్టో అర్థంకాక వినియోగదారులు అయోమయంలో పడుతున్నారు. కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్న నేపథ్యంలో సాధారణ మార్కెట్లలో కొనే పరిస్థితి లేకపోవడంతో వినియోగదారులు రైతు బజార్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడేమో ధరలు పెంచి అమ్ముతుండటంతో దోపిడీకి గురవుతున్నారు.

నాణ్యత అంతంత మాత్రమే

రైతు బజార్లలో తాజా కూరగాయలు లభిస్తాయని వినియోగదారులు వస్తుంటే అక్కడ పండిన, కుళ్లిన టమోటాలు, పురుగులు కొట్టిన మాదిరిగా బంగాళదుంపలు, క్యారెట్లు, నాణ్యత లేని క్యాబేజీ పుచ్చులతో ఉన్న వంకాయలు, పండిన దోసకాయలు దర్శనమిస్తున్నాయి. మొదటి రకం కూరగాయలను సాధారణ మార్కెట్లకు తరలించి నాణ్యత తక్కువగా ఉన్న వాటిని మాత్రమే రైతు బజార్లలో విక్రయిస్తున్నారు.

తాగునీరు.. మైకు ఉండదు

రైతు బజార్‌లో వందలాది మంది దాహార్తి తీర్చేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ రెండేళ్ల కిందట అది మరమ్మతుకు గురవడంతో పక్కన పెట్టేశారు. ప్రతి రైతు బజార్‌కు తప్పక మైక్ సౌకర్యం ఉండాలి. ధరలు నిత్యం మైక్‌లో చెప్పి వినియోగదారులను అప్రమత్తం చేయాలి. కానీ కైకలూరు రైతుబజార్ ద్వారా నెలకు రూ.75 వేల వరకు అద్దెలు వస్తున్నా.. మైక్ మాత్రం ఏర్పాటు చేయడం లేదు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కూరగాయలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేస్తే అమ్మిన వారిని 15 రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నాం. చిన్న ఫిర్యాదు అందిన తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం. వాటర్ ప్లాంట్ మరమ్మతులకు, కొత్త మైక్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. **- నందిని, ఎస్టేట్ అధికారిని, కైకలూరు రైతుబజార్**

కూరగాయలు	బోర్డులో ధర (కేజీ రూ.లలో)	అమ్ముతునది
టమాటా	74	80
బంగాళదుంప	42	50
ఉల్లిపాయలు	58	65
మిర్చి	28	40
బెండ	36	45
వంకాయ	36	40
క్యారెట్	46	55
బీరకాయ	56	65
చిక్కుడు	100	110
సొర, ఆనబ	30	40
అల్లం	70	80



మాట్లాడుతున్న వెట్రిసెల్వి, పక్కన ఆర్డీవో భవానీ శంకరి

చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం అవసరం: కలెక్టర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: చిన్నారుల ఆరోగ్య జీవనంలో పోషకాహారం ప్రధాన పాత్ర మాత్రమే కాదని, దేశ ఆర్థికాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తోందని, చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా చూడాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఆగిరిపల్లి కొండ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆహారాన్ని, చిన్నారుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. ఆర్డీవో భవానీశంకరి, తహసీల్దారు ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న అధికారులకు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎంపీడీవో మల్లీశ్వరి నందివాడ మండలానికి, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ నిడదవోలుకు, ఏవో రమణబాబు కృష్ణా జడ్పీకి బదిలీ కావడంతో పూలమాలలు, శాలువాలతో సిబ్బంది వారిని సత్కరించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కార్యాలయ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఏపీఎం రామకృష్ణ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడేనికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న సిబ్బందికి ఆత్మీయ అభినందన సభ గురువారం నిర్వహించారు. బదిలీపై వెళుతున్న ఏపీఎం రామకృష్ణ, సీసీలు వెంకటరత్నం, అరుణకుమారి, భాగ్యలక్ష్మీలను వీవోఏలు, వీవో అధ్యక్షులు, మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతనంగా ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన దయాల రాజశేఖర్, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయ్ డిజిటల్ షోరూమ్ ప్రారంభం

నూజివీడు, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ గృహోపకరణాల్లో అగ్రగామి విజయ్ డిజిటల్ నూతన షోరూమ్‌ను నూజివీడులో గురువారం నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట రామయ్య, డా.మండవ గంగాధర్ ప్రారంభించారు. అత్యాధునిక పద్ధతిలో నూజివీడులో ఏర్పాటు చేసిన విజయ్ డిజిటల్ షోరూమ్ ప్రారంభోత్సవానికి వినియోగదారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. విజయ్ డిజిటల్ అధినేతలు గంగాధరరావు, ఉషాకిరణ్, రాహుల్, జయశ్రీ, ఎండీ జవ్వాది రాహుల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తదితరులు మాట్లాడారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థాయి



సదస్సులో మాట్లాడుతున్న కోటిరెడ్డి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రేరణకర్త, లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ పూర్వపు జిల్లా గవర్నర్ ఎ.కోటిరెడ్డి అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం నిర్వహించిన యువజన సాధికారత శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. డా.కాసరనేని ధీరజ్, శౌర్యధీర్ హీల్ విద్యార్థులకు అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో కె.వి.రామారావు, శ్రీనివాసరావు, హీల్ ప్రతినిధులు టి.లక్ష్మీ, పి.ధనప్రకాశ్, కె.అజయ్‌కుమార్, బి.సాయిబాబు, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో పందులు పెంచితే చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఈవోపీఆర్డీ ఆనంద్, సర్పంచి ఝాన్సీ

మండవల్లి, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్యలో పందులు పెంచితే కఠిన చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ ఆనంద్‌బాబు హెచ్చరించారు. మండవల్లిలో పందుల పెంపకందారులతో సర్పంచి మెండా ఝాన్సీ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఇటీవల ఇళ్లలోకి పందులు చొరబడి వస్తువులను నాశనం చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్య పందుల పెంపకం చేపట్టరాదని, దూరంగా తరలించాలని సూచించారు. లేకుంటే పందులను పట్టి వేరే ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

ఆశా కార్యకర్తలపై వేధింపులు ఆపాలని ఆందోళన



కలిదిండిలో ధర్నా

కలిదిండి, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలని ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు విజయ, రమాదేవి డిమాండ్ చేశారు. టి.నరసాపురం మండలంలో ఆశా కార్యకర్తను అక్రమంగా విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. దీనికి నిరసనగా కలిదిండిలో గురువారం ధర్నా నిర్వహించారు. కాంతామణి, విమల, సువర్ణ, సుధాకుమారి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఏపీ ఆశా కార్యకర్తల సంఘం మండల కార్యదర్శి సీహెచ్ నీలాంబరి ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో గురువారం నిరసన తెలిపారు. అనంతరం ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.జె.జగన్మోహనరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు, ఎన్.సునీత, ఎల్.సుధా తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏపీ ఆశా కార్యకర్తల సంఘం నాయకులు గురువారం నూజివీడులో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.రాజు, కమల, నాగమణి, కుమారి, స్వాతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కోరుకొల్లు సోమేశ్వరాలయంలో.. కొల్లేటికోటలో.. దేవపూడిలో.. భైరవపట్నంలో.. చినుబండలో.. బలివేలో..

ఆది శక్తి నీవమ్మా.. దుర్గమ్మా



ముదినేపల్లిలో..

న్యూస్‌టుడే బృందం: నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముదినేపల్లి మండలం గురజలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితా దేవిగా, స్థానిక మారుతీనగర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, రేణుకా ఎల్లమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా, పెయ్యేరులోని కనకదుర్గ ఆలయంలో స్వర్ణకవచాలంకృత కనకదుర్గగా, వడాలి వీరాంజనేయస్వామి ఆలయంలో గజలక్ష్మి అలంకారణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చాట్రాయి మండలంలో అమ్మవారి ప్రతిమలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా పందిళ్లకు తరలించారు. కలిదిండి మండలం కోరుకొల్లులోని సోమేశ్వరాలయంలో పార్వతీమాతకు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారం చేశారు. కోదండ రామాలయంలోని రాజరాజేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. సంతోషపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నూజివీడు పట్టణంలోని వివిధ ఆలయాల్లో తొలి రోజున బాలా త్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బలివేలోని రాజరాజేశ్వరి దేవి అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండవల్లి మండలం లోకుమూడి దత్తాశ్రమంలో అమ్మవారిని, మండవల్లి శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో, ఇంగిలిపాకలంక శివగుళ్లంకమ్మను బాలా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు.



పట్టు వస్త్రాల సమర్పణ

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరులోని శ్యామలాంబ అమ్మవారి క్షేత్రంలో మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ముసునూరు, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి ముసునూరు మండలం లోపూడిలో జరిగింది. ఈ ఘటనపై ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

జూద శిబిరంపై దాడి

చాట్రాయి, న్యూస్‌టుడే: పోతనపల్లి శివారు ప్రాంతంలో జూద శిబిరంపై ఎస్సై డి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దాడి చేశారు. ఎస్సై కథనం మేరకు.. ఎనిమిది మంది వ్యక్తులు, ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.29,540 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెంలో జూద శిబిరంపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఏ.నాగబాబు, ఏ.నరేశ్, ఎస్.శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, కె.రామకృష్ణను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతు శ్రేయస్సుకు 'పొలం పిలుస్తోంది'

ముసునూరు, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి అధికారులు ఇచ్చే సలహా సూచనలను రైతులు పాటించాలని ఏవో ఎస్.మధుమోహన్ అన్నారు. గురువారం రమణక్కపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు పలు సూచనలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. రంగు శ్రీనివాసరావు, ఆముదాల ఇస్సాకు, ఉప్పే శివరామకృష్ణ, నాని, సతీశ్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: దిగుబడులకు అనుకూలంగా వరి పైరు ఉందని, వర్షాలు కురిసిన సమయంలో నీరు నిల్వలు పెరగకుండా చూసుకోవాలని వ్యవసాయాధికారి బండారు శివశంకర్ అన్నారు.



చినుబండలో..

చనుబండ, సూరంపాలెం గ్రామాల్లో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వరి పైరును రైతులతో కలిసి క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు, నాయకులు కందుల కృష్ణ, సర్పంచి చిమటబోయిన పుల్లారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలతో భయం భయం!



చాట్రాయిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గ్రామస్థులు నిత్యం భయాందోళన మధ్య గడుపుతున్నారు. ప్రధాన రహదారిలో గుంపులుగా ఉండి వాహనదారులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో అత్యవసర పనులపై బయటకు రావాలంటే చేతిలో కర్ర లేకుండా వచ్చే పరిస్థితి లేదు. చిన్నారులు బడి, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే సమయంలో దాడి చేస్తాయనే ఆందోళనలో తల్లిదండ్రులున్నారు. వాటిలో అవి ఘర్షణ పడి పాదచారులపై దాడులకు దిగుతున్నాయి. **- న్యూస్‌టుడే, చాట్రాయి**